సాక్షి
నిజామాబాద్

గురువారం । 19 । జనవరి । 2023



పార్ట్‌టైం అధ్యాపకులకు పరీక్ష

తెలంగాణ యూనివర్సిటీలో ఎంఎడ్ పార్ట్‌టైం అధ్యాపకుల నియామకం కోసం బుధవారం రాత పరీక్ష నిర్వహించారు.

- 8లో ▸

చిన్నవయసులో పెద్ద కష్టం

భర్తను కోల్పోయి బాధపడుతున్న యువతి.. కుమారుడికి బ్లడ్ క్యాన్సర్ అని తెలియడంతో తల్లడిల్లుతోంది.



- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.6 /18.0

పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

అధికారులతో ఎంపీ సమీక్ష



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ఎంపీ అర్వింద్ తన నివాసంలో బుధవారం ఆర్మూర్ అటవీశాఖ, జాతీయ రహదారుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిజామాబాద్, ఆర్మూర్ రోడ్డు అసంపూర్తిగా ఉండడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిపై సీఎస్‌కు లేఖ రాసి త్వరితగతిన అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేలా చూస్తానన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన వెంటనే అనుమతులు మంజూరు చేసేందుకు తనవంతు సహకరిస్తానని పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో అటవీ శాఖ అధికారి ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్, జాతీయ రహదారుల శాఖ అధికారి పాల్గొన్నారు.

ఆర్‌వోబీ మంజూరుపై సంబరాలు



సుభాష్‌నగర్: నగరంలోని అర్సపల్లి వద్ద రూ. 137 కోట్లతో ఆర్‌వోబీ మంజూరు కావడంపై గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సంబరాలు నిర్వహించారు. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఆర్‌వోబీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 127 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇందుకు కృషి చేసిన ఎంపీ అర్వింద్ ధర్మపురి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గ్రామ కూడలిలో టపాసులు కాల్చారు. ఎంపీకి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'కేసీఆర్ సభ ఓ డ్రామా'



ఆర్మూర్‌టౌన్: ఖమ్మంలో సీఎం కేసీఆర్ సభ ఓ డ్రామా అని ఎంపీ అర్వింద్ విమర్శించారు. ఆయన ఆదివారం సర్వసమాజ్ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజల నుంచి దోచుకున్న డబ్బును బీజేపీ మినహా అన్ని పార్టీలకు స్పాన్సర్ చేస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ దేశ ప్రధాని కావాలని కలలు కంటున్నాడని, కానీ బీఆర్‌ఎస్‌ను ఇతర రాష్ట్రాల్లో ఎవరూ పట్టించుకోరన్నారు. బీజేపీ అధిష్టానం ఎక్కడ నుంచి పోటీ చేయమన్న చేస్తానని ఎంపీ పేర్కొన్నారు. కామారెడ్డి మాస్టార్ ప్లాన్‌ను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, ఇప్పటికే రైతులు ధర్నాలు చేస్తున్నారన్నారు.

సర్వసమాజ్ నూతన అధ్యక్షుడిగా..

ఆర్మూర్ పట్టణంలోని సర్వసమాజ్ నూతన అధ్యక్షుడిగా ఆకుల రాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జెండా గల్లీ గల సర్వసమాజ్ కార్యాలయంలో సర్వసమాజ్ సభ్యుల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఎంపీ అర్వింద్, బీజేపీ రాష్ట్ర నాయకుడు పల్లెగంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్యలు ఆకుల రాజును సన్మానించారు.

పథకాల అమలుపై కేంద్ర పరిశీలకుడు సీరియస్



ఎడపల్లి(బోధన్): కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో అందిస్తున్న సంక్షేమ పథకాల అమల తీరుపై కేంద్ర ప్రభుత్వ పరిశీలకుడు గంగప్ప సీరియస్ అయ్యారు. బుధవారం ఎడపల్లి మండలంలోని ధర్మారంలో క్షేత్రస్థాయిలో పథకాలను పరిశీలించారు. డ్వాక్రా గ్రూపులో, ఉపాధి హామీ పథకం, పింఛన్లు, నరేగా పథకం అమలు తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాలకు అందిస్తున్న రుణాలపై తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ఉపాధి కల్పించడానికి ప్రవేశ పెట్టిన ఉపాధిహామీ పథకంలో పనులు క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు కనిపించడం లేదన్నారు. ఉపాధి హామీలో చేసిన పనులను మళ్లీ చేయడం ఏమిటని ప్రశ్నించారు. డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన నివేదికలు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీడీవో గోపాలకృష్ణ, ఎంపీవో సుభాష్ చంద్రబోస్ తదితరులు ఉన్నారు.

ప్రతిష్ఠాత్మకంగా..

- నేటి నుంచి కంటి వెలుగు ప్రారంభం
- మొదట నగరంలోని న్యూహౌసింగ్ బోర్డు మహిళా భవనంలో..
- 100 రోజుల పాటు కార్యక్రమం
- పండుగలు, ఆదివారాల్లో సెలవు



మాక్లూర్ మండలం బొంకన్‌పల్లిలో శిబిరంలో కంటివెలుగు డెమోలో పాల్గొన్న కలెక్టర్ నారాయణరెడ్డి

నిజామాబాద్ సిటీ: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం నేటి నుంచి ప్రారంభం కానుంది. తొలిరోజు జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో గల న్యూ హౌసింగ్ బోర్డు కాలనీ మహిళా భవనంలో కలెక్టర్ నారాయణరెడ్డి ప్రారంభించనున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా కంటి వెలుగు కార్యక్రమానికి 70 బృందాలు, ఒక్కో బృందంలో 8 మంది చొప్పున మొత్తం 560 మందిని వైద్య సిబ్బందిని నియమించారు.

కార్యక్రమం అమలు ఇలా..

- కంటి వెలుగు కార్యక్రమాన్ని నేటి నుంచి పండుగలు, ఆదివారాలు మినహా 100 రోజుల పాటు కొనసాగుతుంది.
- నిత్యం 60 నుంచి 100 మందికి కూపన్లు కంటి పరీక్షలు చేస్తారు. కూపన్లు తీసుకున్న వారు నిర్దేశిత తేది, సమయం ప్రకారం కంటి వెలుగు సెంటర్లకు వెళ్తే అక్కడి వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారు.
- ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందుల పంపిణీ, అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్సలు చేయడం కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.
- వైద్య శిబిరంలో కళ్లలో శుక్లం, మోతిబిందువు, పొర, నల్లపాప మీద పొర, నరం బలహీనత వల్ల అంధత్వం, నీటికాసులు, కంటిచూపుల్లో లోపాలు, మెల్లకన్ను వంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తారు.
- శస్త్రచికిత్స అవసరమైన వారిని ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ చేసి కంటి అద్దాలను అందజేస్తారు.
- క్యూలైన్‌లో గంటల తరబడి నిలబడాల్సిన అవసరం లేకుండా వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి ఇంటి నంబర్ల ఆధారంగా టోకెన్లను పంపిణీ చేస్తారు.
- జిల్లాలో జనాభా ఆధారంగా 40 శాతం మందికి శిబిరాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు.
- ప్రజలకు అందజేసేందుకు జిల్లాలోని అన్ని పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లకు ఈపాటికే 66,300 వందల కళ్లజోళ్లు(రీడింగ్ గ్లాస్‌లు) పంపారు.

సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- కంటివెలుగును ప్రారంభించనున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

సుభాష్‌నగర్: దృష్టి లోపాలను దూరం చేయాలనే నిశ్చయంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు–2 కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. గురువారం ఉద యం 9 గంటలకు జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్ హౌసింగ్ బోర్డు కార్యాలయం సమీపంలో గల స్త్రీశక్తి భవన్‌లో రాష్ట్ర రోడ్లు – భవనాల శాఖామంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి కంటి వెలుగు శిబిరాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. శిబిరాల నిర్వహణ కోసం అవసరమైన బృందాలు, సామాగ్రిని ఇప్పటికే సమాయత్తం చేశామన్నారు. 18ఏళ్లు పూర్తి చేసుకున్న ప్రతిఒక్కరూ కంటి వెలుగు శిబిరాల్లో నేత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరాల నిర్వహణ కోసం జిల్లా వ్యాప్తంగా 70 బృందాలను ఏర్పాటుచేశామని, ఒక్కో బృందం ప్రతిరోజు 120 నుంచి 130 మందికి స్క్రీనింగ్ నిర్వహిస్తుందని తెలిపారు. అవసరమైన వారికి శిబిరాల్లోనే మందులు, దూరదృష్టి లోపం ఉన్న వారికి కంటి అద్దాలు అందిస్తారని పేర్కొన్నారు. ప్రిస్క్రిప్షన్ అద్దాలు అవసరమున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారని, పక్షం రోజుల్లోపు వారికి కంటి అద్దాలు ఇంటికి చేర్చేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. దృష్టి లోపాలను దూరం చేసేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

కంటి పరీక్షలకు అందరూ వచ్చేలా..

- సెర్ప్ ఉద్యోగులకు బాధ్యత

మోర్తాడ్(బాల్కొండ): కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని విజయవంతం చేసే బాధ్యతను అధికార యంత్రాంగం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఉద్యోగులపై మోపారు. మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో రోజుకు 200ల మంది తగ్గకుండా, గ్రామీణ ప్రాంతాల్లో 130కి మించి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సెర్ప్ ఉద్యోగులకు నిర్దేశించారు.

కంటి వెలుగు శిబిరం ఉదయం 10 గంటలకు ఆరంభమై సాయంత్రం 4 గంటలకు ముగిసిపోయేలా ప్రభు త్వం షెడ్యూల్‌ను ఖరారు చేసింది. శిబిరాల్లో వైద్య సిబ్బంది ఖాళీగా కూర్చునే అవకాశం ఇవ్వకుండా రద్దీ కొనసాగేలా సెర్ప్ ఉద్యోగులు ఏర్పాట్లు చేయాలని అధికారులు ఆదేశించారు. మహిళా సమాఖ్యలు, సంఘాలు పూర్తిగా సెర్ప్ కనుసన్నలలో కొనసాగుతుండడంతో కంటి వెలుగు శిబిరాలకు ప్రజలను తరలించే బాధ్యతను వారికే అప్పగించారు. ఇప్పటికే సన్నాహక సమావేశాలను నిర్వహించి రోజువారి లక్ష్యాలను సూచించారు. మండల స్థాయిలో మండల పంచాయతీ అధికారి, సెర్ప్ ఏపీఎం, సీసీలు శిబిరాల్లో జనం రద్దీని పర్యవేక్షించనున్నారు.

పన్నాగం పటాపంచలు

- బెడిసికొట్టిన ధర్మానాయక్ వ్యూహం
- బీమా డబ్బుల కోసం హత్యకు నిజామాబాద్‌లోనే ప్లాన్
- కేసును ఛేదించిన పోలీసులు
- కేసులో రెండో నిందితుడు దర్యాపూర్ వాసి శ్రీనివాస్



భార్య నీల, సోదరి సుందతో నిందితుడు ధర్మానాయక్



బాబు సీసీ ఫుటేజీ

ఖలీల్‌వాడి: బీమా డబ్బుల కోసం సచివాలయ ఉద్యోగి ధర్మానాయక్ పన్నిన పన్నాగం పటాపంచలైంది. అత్యాశతో ఓ వ్యక్తి ఉసురు తీసిన ధర్మానాయక్ కుటుంబం కటకటాల పాలైంది. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం వెంకటాపూర్ పంచాయతీ పరిధిలోని బీమ్లా తండాకు చెందిన ధర్మానాయక్ సెక్రెటేరియట్‌లోని ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ప్రభుత్వ ఉద్యోగి అయినా.. అధికంగా డబ్బు సంపాదించాలనే అత్యాశ ఆయనది. మొదట్లో షేర్, స్టాక్ మార్కెట్‌లో లాభాలు వచ్చాయి. కరోనా, ఉక్రెయిన్ వార్ కారణంగా నష్టాల పాలయ్యాడు. చిట్టీలు వేస్తూ కొంత డబ్బు కూడబెట్టి మళ్లీ షేర్‌లలో పెట్టినా వచ్చిన డబ్బుతో అప్పు లు తీరలేదు. దీంతో అప్పుల నుంచి బయటపడేందుకు ఎల్‌ఐసీ పాలసీ ప్లాన్ వేశాడు. అప్పు నుంచి తప్పించుకోవడానికి బీమా పాలసీ చేయడం, దానికి క్లైయిమ్ చేయడానికి ఒకరిని హతమార్చే విషయమై ముందుగానే కుటుంబసభ్యులతో ధర్మానాయక్ చర్చించాడు. మూడు నెలల ముందే అనేక వ్యూహాలు పన్నాడు. తన పథక రచన సజావుగా సాగేందుకు తన భార్య నీలతో పాటు నవీపేట మండలం దర్యాపూర్‌కు చెందిన సోదరి సుంద, ఆమె కుమారుడు తేజవత్ శ్రీనివాస్‌లను కూడా ఇందులో ఇన్‌వాల్వ్ చేశాడు.

ధర్మానాయక్, అతని మేనల్లుడు తేజవత్ శ్రీనివాస్ జనవరి 7న నాంపల్లి మెట్రో స్టేషన్ నుంచి అంజయ్య అనే వ్యక్తిని తోటలో ఉద్యోగం ఉందని నమ్మించి నెలకి రూ. 15 నుంచి రూ. 20 వేల జీతం ఇస్తామని నిజామాబాద్‌కు తీసుకువచ్చారు. మార్గమధ్యలో ముగ్గురు మద్యం సేవించారు. అయితే అంజయ్య మద్యం మత్తులో ఉండడంతో అతనిని చంపితే ఇన్సూరెన్స్ డబ్బులు రావని భావించి హత్యను వాయిదా వేశారు. అంజయ్యను నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు లాడ్జికి తీసుకుచ్చారు. ఊరు దూరంలో ఉందని రాత్రికి అక్కడే బస చేసి మరుసటి రోజు వెళ్దామని అంజయ్యకు చెప్పారు. ఇద్దరు నిందితులు మద్యం సేవించడానికి దగ్గరలోని బార్‌కు వెళ్లి.. అంజయ్యను భోజనం కోసం బయటకు వెళ్లి రమ్మని చెప్పారు. అంజయ్య బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఈ నెల 8న ధర్మానాయక్‌ను పోలిన వ్యక్తి కోసం నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో వెతకడం ప్రారంభించారు. రైల్వేస్టేషన్ ప్రాంతంలోని లేబర్ అడ్డా వద్ద కనిపించిన బాబు అనే వ్యక్తిని ఎంపిక చేసుకున్నారు. బాసరలో గుండు చేయించుకుని వద్దామని అతడిని ఒప్పించి తీసుకువెళ్లారు. దుస్తులను మార్చుకోవాలని ధర్మానాయక్ తన దుస్తులను అతడికి ఇచ్చాడు. బాసరకు వెళ్లి వచ్చిన తర్వాత అదే రాత్రి 11.50 గంటలకు ధర్మానాయక్, అతడి మేనల్లుడు తేజవత్ శ్రీనివాస్‌లు హోండా అమేజ్ కార్‌లో మెదక్ జిల్లా వెంకటాపురం చెరువు వద్దకు వెళ్లారు. అక్కడ ధర్మానాయక్ కారు లోపల, బయట పెట్రోల్ పోశాడు. ముందు సీట్లో కూర్చోవాలని బాబుకు చెప్పగా.. అతడు నిరాకరించడంతో ధర్మానాయక్ గొడ్డలితో కొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. అనంతరం కారులోని ముందు సీట్లోకి మృతదేహాన్ని మార్చి నిప్పంటించారు. అనంతరం తానే మరణించినట్లు ధర్మానాయక్ అందరినీ నమ్మించాడు. కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.

అనుమానంతో విచారణ

కారుతో పాటు వ్యక్తి దహనమైన కేసును పోలీసులు సవాల్‌గా తీసుకున్నారు. ఘటనాస్థలిలో చనిపోయిన వ్యక్తి ధర్మానాయక్ కాదన్న అనుమానంతో పోలీసులు జరిపిన విచారణ, ఆయన కుటుంబసభ్యులపై పెట్టిన నిఘా కారణంగా వారంరోజుల్లోనే కేసును పోలీసులు ఛేదించారు. కేసుకు సంబంధించిన విచారణ కోసం మెదక్ పోలీసులు బుధవారం నిజామాబాద్‌కు వచ్చారు. ఇక్కడ ధర్మానాయక్ ఓ లాడ్జిలో ఉన్నట్లు గుర్తించి సీసీ టీవీ ఫుటేజీలను సేకరించారు. మృతుడు బాబుకు సంబంధించిన వివరాలపై ఆరా తీస్తున్నారు. ధర్మానాయక్, అతని మేనల్లుడు శ్రీనివాస్ జిల్లా కేంద్రంలో ఎవరిని కలిశారు.. ఎక్కడ హత్యకు స్కెచ్ వేశారో ఆధారాలను సేకరిస్తున్నారు. అలాగే జిల్లా పోలీసులు బాబుకు సంబంధించిన వివరాలను ఆరా తీస్తున్నారు. బాబు నిజామాబాద్ నగరానికి చెందిన వాడా.. లేక ఇతర ప్రాంతం వాడా అని గుర్తించే పనిలో ఉన్నారు. జిల్లాతో పాటు ఇతర జిల్లాలకు సంబంధించిన మిస్సింగ్ కేసులను ఆరా తీస్తున్నారు.

'లక్ష్మి' కాలువకు ముప్పు!

- కొత్తపల్లి వద్ద కుంగుతున్న కట్ట
- గండి పడే ప్రమాదం ఉందని రైతుల ఆవేదన



కొత్తపల్లి వద్ద కుంగుతున్న లక్ష్మి కాలువ కట్ట

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే లక్ష్మి కాలువ ముప్కాల్ మండలం కొత్తపల్లి వద్ద కుంగి ప్రమాదకరంగా మారింది. ఏ క్షణాన గండి పడుతుందోనని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. డీ–3 కాలువ హెడ్ రెగ్యులేటర్‌కు ఎదురుగా ఆనకట్ట కుంగి సిమెంట్ లైనింగ్‌కు పూర్తిగా పగుళ్లు వచ్చాయి. అయినా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు చేపట్ట లేదు. గతంలో ఇప్పుడు కుంగిన ప్రాంతానికి సమీపంలో పెద్ద గండి పడింది. ప్రస్తుతం ఇక్కడ కూడా గండి పడే ప్రమాదం ఉందని రైతులు పేర్కొంటున్నారు. లక్ష్మి కాలువ ప్రధాన కాలువ 3.5 కిలోమీటర్ల మేర ఉంది. అక్కడి నుంచి ఉప కాలువల ద్వారా నీరు సరఫరా అవుతుంది. నాలుగు ఉప కాలువలు ఉన్నాయి. ప్రస్తుతం కుంగుతున్న కట్ట డీ–3 కాలువ హెడ్‌రెగ్యులేటర్‌కు ఎదురుగా ఉంది. అలానే డీ–4 కాలువ హెడ్ రెగ్యులేటర్‌కు సమీపంలో ఉంది. కాలువ నీటి జంక్షన్ వద్ద ఉండటంతో ఆనకట్టకు ఒత్తిడి ఎక్కువ అవుతుంది. దీంతో కట్ట కుంగిపోతోంది. డీ–3 కాలువకు నీరు సరఫరా చేపట్టే సమయంలో డీ–4 కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను మూసివేస్తున్నారు. దీంతో డీ–3 కాలువ హెడ్ రెగ్యులేటర్ వద్ద నీరు అధికంగా నిలిచి కట్టపై ఒత్తిడి పెరుగుతుంది. రెండు సంవత్సరాల నుంచి కొద్ది కొద్దిగా కుంగుతున్న సంబంధిత అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. ప్రమాదవశాత్తు గండి పడితే కొత్తపల్లి వాసులు సగం పంట పొలాలు నీటికి కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. అంతే కాకుండా డీ–4 కాలువ ఆయకట్టు ఎండిపోయే ప్రమాదం ఉంది. ఉన్నత అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని ఆయకట్టు రైతులు వేడుకుంటున్నారు.

ప్రతిపాదనలు చేస్తున్నాం

కాలువ మరమ్మతుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. కాలువ వద్ద గండి పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కువైన నీరు పోవడానికి పక్కనే వాగు ఉంది. త్వరలోనే ప్రతిపాదనలు పంపుతాం. – సురేశ్, డిప్యూటీ ఈఈ, మైనర్ ఇరిగేషన్

కౌన్సిలర్లలో టెన్షన్ టెన్షన్

- మాస్టర్ ప్లాన్ రద్దుకోసం రాజీనామా చేయాలంటున్న రైతులు
- నేటితో ముగియనున్న డెడ్‌లైన్
- రైతులకు మద్దతు తెలిపిన బీజేపీ కౌన్సిలర్లు
- అయోమయంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు



సాక్షి, కామారెడ్డి/కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంగా ఎదిగిన కామారెడ్డి పట్టణం నలువైపులా విస్తరిస్తుండడంతో చుట్టుపక్కల గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేశారు. దీంతో తమ గ్రామాలకు పట్టణ శోభ వస్తుందని, తమ భూముల ధరలు మరింత పెరిగుతాయని విలీన గ్రామాల రైతులు ఆశించారు. అయితే మాస్టర్ ప్లాన్ వారి ఆశలపై నీళ్లు చల్లింది. కొత్తగా రోడ్లకు ప్రతిపాదించడంతోపాటు ఇండస్ట్రియల్, గ్రీన్ జోన్ల పేరుతో విలువైన భూములను తమకు కాకుండా చేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొత్త మాస్టర్ ప్లాన్ ముసాయిదా తమ జీవితాలను తలకిందులు చేస్తుందని గ్రహించిన ప్రజలు నెలన్నర క్రితం ఆందోళన బాట పట్టి అలుపెరుగని పోరు సాగిస్తున్నారు. ఈనెల 12వ తేదీన లింగాపూర్‌లో జరిగిన రైతుల సమావేశంలో విలీన గ్రామాల కౌన్సిలర్‌ల రాజీనామాలకోసం తీర్మానం చేశారు. 17న పాతరాజంపేటలో మరోసారి సమావేశమై రాజీనామాలకు డెడ్‌లైన్ విధించారు. 19వ తేదీ సాయంత్రంలోపు రాజీనామాలు అందించాలని డిమాండ్ చేశారు. దీంతో ఆ సమావేశంలో పాల్గొన్న బీజేపీకి చెందిన 2, 11వ వార్డుల కౌన్సిలర్లు సుతారి రవి, కాసర్ల శ్రీనివాస్‌లు తమ రాజీనామా పత్రాలను రైతు జేఏసీ ప్రతినిధులకు అందించారు. ఇక మిగిలిన 1, 6, 9, 10, 12, 12, 35వ వార్డుల కౌన్సిలర్లు రాజీనామా చేయాల్సి ఉంది.

ససేమిరా అంటున్న కౌన్సిలర్లు

దేవునిపల్లికి చెందిన కాసర్ల గోదావరి, పోలీస్ కృష్ణాజీరావు, ఉర్దొండ వనిత తమ వార్డు రైతులు ఎవ్వరూ బాధితులు లేరని, తమ వద్దకు వస్తే తాము జవాబు చెప్పి నచ్చజెప్పుతామని సాక్షితో తెలిపారు. టేక్రియాల్‌కు చెందిన జాజాల్ శంకర్‌రావు మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశంలో మాస్టర్‌ప్లాన్ రద్దుకు డిమాండ్ చేస్తానని తెలిపారు. అడ్లూర్‌కు చెందిన గడ్డమీది రాణి గతంలోనే కలెక్టర్‌కు మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని వినతిపత్రం అందజేశారు. పాతరాజంపేటకు చెందిన ఆకుల రూపాతో పాటు అధికార పార్టీ కౌన్సిలర్లు ప్రభుత్వ విప్ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నట్లు తెలిసింది. అయితే చైర్‌పర్సన్‌కు డెలివరీ కావడం, ఆమె తండ్రి శబరిమల వెళ్లడంతో రెండు మూడు రోజుల్లో కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసేలా చూస్తామని కౌన్సిలర్లు అంటున్నారు. ఇప్పుడు రాజీనామాలు ఎందుకు చేయాలని వారు వాపోతున్నారు.

రేపు ప్రభుత్వ విప్ ఇంటి ముట్టడి

కౌన్సిల్ సమావేశం ఈ నెల 19న నిర్వహించి మాస్టర్ ప్లాన్ రద్దు చేయకుంటే, 20న ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఇంటిని ముట్టడిస్తామని రైతు జేఏసీ నాయకులు గతంలోనే ప్రకటించారు. అయితే గురువారం కౌన్సిల్ సమావేశం జరిగే అవకాశం లేదు. దీంతో శుక్రవారం ప్రభుత్వ విప్ ఇంటి ముట్టడికి రైతులు, రైతు జేఏసీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

గంప గోవర్ధన్ కాలికి గాయం కావడంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. సమాధానం చెప్పే చైర్‌పర్సన్ ప్రసవం అయి హైదరాబాద్‌లోనే ఉన్నారు. ఇక ఉన్నది వైస్ చైర్‌పర్సన్ ఇందుప్రియ మాత్రమే. ఆమె సొంత నిర్ణయం తీసుకునే అవకాశం లేదు. పోలీసులు మాత్రం ముట్టడిని అడ్డుకునేందుకు చర్యలు చేపట్టారు.

శ్మశానాలనూ మింగేస్తున్నారు..!

- ధర్మపురి హిల్స్‌లో స్థలం కబ్జా !
- నిరసన తెలిపిన స్థానికులు





ధర్మపురిహిల్స్‌లో శ్మశానవాటికకు సంబంధించిన భూమిని కబ్జా చేసిన దృశ్యం

నిజామాబాద్‌నాగారం: ఇందూరులో కబ్జాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది.. ప్రజాప్రతినిధుల కన్నుపడితే చాలు నగరం నడిబొడ్డయినా.. శివారు ప్రాంతంలో అయినా సరే ఆక్రమణకు గురికావాల్సిందే.. ఇదివరకే ఆలయాల భూములు కబ్జాలకు గురైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి.. తాజాగా శ్మశానాలను సైతం వదలడం లేదు.. నిజామాబాద్ నగర శివారులోని ధర్మపురి హిల్స్‌లో శ్మశానాల భూమిని స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో కొందరు అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు. దీనిపై స్థానికులు బుధవారం నిరసన చేపట్టారు.

ఇదీ పరిస్థితి..

నగర శివారులోని ధర్మపురి హిల్స్ కాలనీ 2004–05 సంవత్సరంలో ఏర్పడింది. ప్రస్తుతం 12, 13 డివిజన్‌లకు సంబంధించి ఇదే ప్రాంతంలో పెయింటర్స్ కాలనీ, మౌలనాహతవుర్ రెహమాన్ కాలనీ, డ్రైవర్స్ కాలనీ, హమాన్ కాలనీ, అసద్ బాబానగర్, రంజనీబాబా కాలనీలకు సంబంధించి 46వేలకు పైగా జనాభా ఉంది. 20వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఈ ప్రాంతంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే నంబర్ 253లో రెండు ఎకరాల భూమిని శ్మశానవాటిక కోసం కేటాయించింది. 12, 13 డివిజన్లలో నివసించే ప్రజలతో పాటు, చుట్టుపక్కల ఎవరైనా చనిపోతే మృతదేహాలను ఇక్కడే పూడ్చివేస్తున్నారు. అయితే కొందరు అక్రమార్కులు ఈ స్థలాన్ని కూడా కబ్జా చేస్తున్నారు.

రాత్రికి రాత్రే..

ధర్మపురిహిల్స్ కాలనీలో రెండేళ్ల క్రితం సమాధుల పక్కనే మైనారిటీ గురుకుల పాఠశాల నిర్మించారు. మరో రెండు గురుకులాలకు సంబంధించి పనులు కూడా జరుగుతున్నాయి. దీంతో భూముల ధరలు పెరిగాయి. ప్రస్తుతం గజం రూ. 6వేల నుంచి రూ. 8వేల వరకు పలుకుతుంది. ఈ ప్రాంతంలో మైనారిటీ గురుకులాలు ప్రారంభమైతే భూముల ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది. అందుకే ముందస్తుగానే ప్రజాప్రతినిధులకు సంబంధించిన వ్యక్తులు చుట్టుపక్కల ఉన్న ఖాళీ స్థలాలను, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అంతటితో ఆగకుండా శ్మశాన వాటిక స్థలాన్ని ఎలాగైనా కబ్జా చేయాలని పథకం వేసుకున్నారు. రాత్రికి రాత్రే శ్మశానాల స్థలంలో తవ్వకాలు చేపట్టారు. ఇప్పటికే ఎకరానికి పైగా భూమిని తవ్వేశారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రశ్నిస్తే మరోచోట భూమి ఇస్తాం

శ్మశానాలకు సంబంధించిన భూమిని కబ్జా చేస్తున్న విషయాన్ని ఇమామ్ హైమాద్‌రజా గ్రేవా కమిటీ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాప్రతినిధిని అడిగితే మరోచోట భూమి ఇంతకన్నా ఎక్కువ ఇస్తామని చెప్పడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. శ్మశానం భూమిని కబ్జా చేయడం ఏమిటన్నారు.

కబ్జా చేయవద్దు



కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ప్రభుత్వం రెండు ఎకరాల్లో సమాధుల కోసం భూమిని కేటాయించింది. ఇందుకు సంబంధించిన ప్రొసీడింగ్ కాపీ ఉంది. కానీ ఈ స్థలాన్ని కబ్జా చేయాలని చూడడం సరికాదు. – ఎండీ బషీర్ హైమద్, కమిటీ అధ్యక్షుడు

కంచె ఏర్పాటు చేసి రక్షించాలి



శ్మశాన వాటిక స్థలంలో ఇప్పటికే సమాధులు చాలా ఉన్నాయి. కబ్జా చేసిన ప్రాంతంలో చాలా సమాధులు పోయాయి. వెంటనే ఈ కబ్జాలను అరికట్టాలి. సంబంధిత అధికారులు స్పందించి స్థలానికి కంచె ఏర్పాటు చేసి రక్షించాలి. – ఖాజా ఎత్తేసామొద్దీన్, నగరవాసి

కబ్జాలు ఆపకుంటే ఉద్యమిస్తాం

ప్రభుత్వ భూములు ఇప్పటికే చాలాచోట్ల కబ్జాకు గురవుతూనే ఉన్నాయి. శ్మశానాలకు చెందిన భూములు కబ్జా చేయడం సిగ్గుచేటు. స్థలాన్ని ఆక్రమించాలని చూస్తే ఉద్యమాలు చేస్తాం. స్థానికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది. – సయ్యద్ ఖైసర్, కాంగ్రెస్‌నాయకులు

క్లుప్తంగా

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో బుధవారం ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారిణి అరుణ తెలిపారు. ఉదయం జరిగిన 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు మొత్తం 1803 మందికి 1690 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 3వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు మొత్తం 8884 మందికి 8212 మంది హాజరయ్యారు.

నేడు వాహనాల వేలం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఎక్సైజ్ పరిధిలో వివిధ కేసులలో పట్టుబడిన (03) వాహనాలకు గురువారం ఉదయం 10 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలంపాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

రేపు బోధన్‌లో..

బోధన్‌టౌన్(బోధన్): వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు శుక్రవారం పట్టణంలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. 14బైక్‌లు, 2ఆటోలకు ఉదయం 10 గంటలకు వేలం ప్రారంభమవుతుందని, ఆసక్తి గలవారు పాల్గొనవచ్చన్నారు.

ఆర్టీసీ ఖాళీ స్థలాలు, షాపులకు..

ఖలీల్‌వాడి: నిజామాబాద్ రీజియన్ పరిధిలోని వివిధ డిపోలలో మేజర్ బస్‌స్టేషన్లలో ఉన్న ఖాళీగా ఉన్న షాపులు, స్థలం, పార్కింగ్ లైసెన్స్ జారీ కోసం వేలం నోటిఫికేషన్ ఇచ్చినట్లు ఆర్ఎం ఉషాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారాలను నేటి నుంచి 28 వరకు సంబంధిత డిపో మేనేజర్ కార్యాలయంలో పొందవచ్చునన్నారు. కామారెడ్డి, బాన్సువాడ డిపోలకు సంబంధించి పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను డిపో మేనేజర్ కార్యాలయంలో ఈనెల 30లోపు అందజేసి రశీదు పొందాలన్నారు. ఆర్మూర్, బోధన్, నిజామాబాద్–1 , 2 డిపోలకు సంబంధించిన దరఖాస్తులను రీజినల్ మేనేజర్ కార్యాలయం, నిజామాబాద్‌లో ఈనెల 31 లోపు అందజేసి రశీదు పొందవచ్చునన్నారు.

28న సైన్స్ సెమినార్

నిజామాబాద్‌అర్బన్: ఈ నెల 28న ఉపాధ్యాయులకు సైన్సుసెమినార్ నిర్వహిస్తున్నట్లు బుధవారం డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. 'దేశాన్ని స్వావలంబనగా మార్చడానికి సైన్స్ సంస్కృతిని ప్రోత్సహించడం' అనే అంశంపైన రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యావేత్తలు, ఇతర క్షేత్రస్థాయి కార్యకర్తలకు ఒక రోజు సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి సమాచారం కోసం 9848219365ను సంప్రదించాలన్నారు.

గుర్తుతెలియని జంతువు సంచారం



నందిపేట్ (ఆర్మూర్): డొంకేశ్వర్ మండలంలోని అన్నారం సిర్పూర్ గ్రామ శివారులో గుర్తుతెలియని జంతువు సంచరించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్థానిక రైతులు మంగళవారం తమ పంట పొలాలకు వెళ్లినప్పుడు ఓ జంతువు నడుచుకుంటూ వెళ్లడం గమనించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అటవీ శాఖ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఇది చిరుత పాదముద్రలు కాదని కుక్క జాతికి చెందిన అటవీ జంతువు అని డిప్యూటీ రేంజ్ అధికారి సుధాకర్ తెలిపారు. ఇది మాంసాహారేనని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జంతువులను గుర్తించేందుకు కెమెరాను ఏర్పాటు చేశారు.

చిన్న వయసులో పెద్ద కష్టం

- రెండేళ్ల క్రితం గుండెపోటుతో భర్త మృతి
- ఆరేళ్ల కుమారుడికి బ్లడ్ క్యాన్సర్
- కాపాడుకునేందుకు అష్టకష్టాలు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న మానస



బీడీలు చుడుతున్న మానస, పక్కన ఆమె కుమారుడు ఆశిష్

సాక్షి, కామారెడ్డి: పాతికేళ్ల వయసు కూడా లేని ఆ యువతి భర్తను పోగొట్టుకుంది. ఆ షాక్ నుంచి తేరుకోకముందే ఆరేళ్ల కుమారుడికి బ్లడ్ క్యాన్సర్ అని తేలడంతో తల్లడిల్లిపోతోంది. కొడుకును కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతోంది. కామారెడ్డిలోని ఇందిరానగర్ కాలనీలో నివాసముండే రేగొండ మానసకు బీబీపేటకు చెందిన చంద్రశేఖర్‌తో ఎనిమిదేళ్ల క్రితం పెళ్లి జరిగింది. భార్యాభర్తలు హైదరాబాద్‌లో ఉండి జీవనం సాగించారు. వారికి ఇద్దరు పిల్లలు. సాఫీగా సాగుతున్న సంసారం రెండేళ్ల కిందట ఒక్కసారిగా తలకిందులైంది. మానస భర్త చంద్రశేఖర్ గుండెపోటుతో చనిపోయాడు. దీంతో మానస పరిస్థితి రెక్కలు తెగిన పక్షిలా మారింది. భర్తను పోగొట్టుకున్న మానస ఉండడానికి ఇల్లు కూడా లేని పరిస్థితుల్లో బతకడం భారంగా మారి కామారెడ్డిలోని ఇందిరానగర్‌లో ఉన్న తల్లిగారింటికి చేరింది. బీడీలు చుడుతూ ఇద్దరు పిల్లల్ని సాకుతుంది. కష్టాల్లో ఉన్న ఆమెకు దేవుడు ఇంకో పరీక్ష పెట్టాడు. తన ఆరేళ్ల కొడుకు ఆశిష్ ఏడాదిన్నర కిందట కాళ్లు, చేతులు గుంజుతున్నాయని మంచం పట్టడంతో ఆస్పత్రుల చుట్టూ తిరిగింది. ఆఖరుకు చిన్నోడికి బ్లడ్‌క్యాన్సర్ అని డాక్టర్లు తేల్చారు. మందులు వాడాలి. అంతేగాకా నెలకోసారి బ్లడ్ ఎక్కించాల్సి ఉంటుంది. హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రికి తీసుకువెళ్లాలి. ప్రతీసారి మూడు ప్యాకెట్ల రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. రాకపోకల ఖర్చులతో పాటు రక్తం కోసం ఆస్పత్రికి వెళ్లినపుడల్లా దాదాపు రూ.రెండు వేలు ఖర్చు అవుతాయి. బీడీలు చుడుతూ పిల్లల్ని పోషిస్తున్న మానస నెలకు రెండు వేలు ఖర్చు చేయడం భారంగా మారింది. మానసకు రేషన్ కార్డు లేదు. కనీసం పింఛను కూడా రాదు. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లల పోషణ, ఆస్పత్రికి వెళ్లిరావడానికి అవస్థలు పడుతోంది. తన కొడుకుని కాపాడాలని ప్రభుత్వాన్ని వేడుకుంటోంది. ఆస్పత్రికి వెళ్లిరావడం, బిడ్డకు మంచి ఆహారం అందించడం కూడా భారంగ మారిందని ఆవేదన చెందుతోంది. ప్రభుత్వం, దాతలు తనను ఆదుకోవాలని కోరుతోంది.

దాతలు సంప్రదించాల్సిన వివరాలు..

గూగుల్ పే 9640705100 (రేగొండ పద్మ)
బ్యాంక్ అకౌంట్ నంబరు : 32666677126
పేరు : రేగొండ పద్మ
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్0005073
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కామారెడ్డి
(హైవే రోడ్డు బ్రాంచ్)

కంటి వెలుగు శిబిరాల పరిశీలన



కల్లెడి గ్రామంలోని కంటివెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మాక్లూర్: మండలంలోని కల్లెడి, బొంకన్‌పల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను బుధవారం కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. ఏర్పాట్లను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వైద్య బృందంలోని సభ్యులు సమయ పాలన పాటిస్తూ, ఉదయం 8.30 గంటల్లోపు శిబిరాల వద్దకు చేరుకోవాలన్నారు. శిబిరాలు పూర్తిస్థాయిలో విజయవంతం అయ్యేలా, కంటి వెలుగు లక్ష్యం నెరవేరేలా ప్రజాప్రతినిధులు తోడ్పాటు అందించాలన్నారు. ఎంపీడీవో క్రాంతి, తహసీల్దార్ శంకర్, ఎంపీవో శ్రీనివాస్, వైద్యాధికారి సరిత పాల్గొన్నారు.

దోమకొండ పోలీస్‌స్టేషన్ తనిఖీ



దోమకొండ పోలీస్‌స్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ అన్యోన్య

దోమకొండ: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను బుధవారం జిల్లా అడిషనల్ ఎస్పీ అన్యోన్య తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరు, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గురువారం ప్రారంభం కానున్న కంటి వెలుగు శిబిరం నిర్వహించనున్న ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను తెలుసుకున్నారు. కంటి వెలుగు శిబిరం వద్ద వసతులు పరిశీలించారు. ఎస్సై సుధాకర్, ఏఎస్సై చారి తదితరులు ఉన్నారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

డిచ్‌పల్లి: మండలంలోని అమృతాపూర్ క్యాంప్ గ్రామంలో ఓ యువకుడు జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన నరేష్ (27)కు కొంత కాలంగా మానసిక స్థితి సరిగా లేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంట్లోని ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి వెంకటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రౌడీషీటర్ హత్య కేసులో సీన్ రీకన్‌స్ట్రక్షన్

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నెహ్రూనగర్‌లో రౌడీషీటర్ ఇబ్రహీం ఛావూస్ ఆలియాస్ జంగిల్ ఇబ్బు హత్య కేసులో బుధవారం నిందితులను కోర్టు అనుమతితో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేసినట్లు ఎస్సై సాయికుమార్‌గౌడ్ తెలిపారు. కస్టడీలోకి తీసుకున్న ఆరిఫ్‌డాన్‌తోపాటు మరికొంత మందిని పోలీసులు ఘటనాస్థలానికి తీసుకెళ్లి, హత్య జరిగిన విధానం, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత కోర్టుకు అప్పజెప్పినట్లు ఎస్సై చెప్పారు.

బెల్టుషాపుల్లో సిట్టింగ్స్..

- ఉన్నతాధికారులకు పలువురి ఫిర్యాదు
- అడ్డుకోవాలని ఎక్సైజ్, పోలీసు శాఖలకు ఆదేశం

మోర్తాడ్(బాల్కొండ): మండలాలు, గ్రామాల్లో అనధికారికంగా బెల్టుషాపుల్లో యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఈక్రమంలో బెల్టుషాపుల్లో అనేక మంది కూర్చుని మద్యం తాగడం, చట్ట విరుద్ధమైన సిట్టింగ్‌ల వల్ల బార్‌లు వెలవెలబోతున్నాయని అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో ఆయా శాఖల అధికారులు బెల్ట్‌షాపుల్లో సిట్టింగ్‌లపై దృష్టిసారించింది. నగర కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో ఉన్న బార్‌లకు తాము ఏటా ఎక్కువ మొత్తంలో లైసెన్స్ ఫీజును చెల్లిస్తున్నామని, అక్రమ సిట్టింగ్‌ల వల్ల తమకు గిరాకీ దెబ్బతిందని బార్‌ల యజమానులు ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

జిల్లాలో 102 మద్యం దుకాణాలు, 15బార్లు..

జిల్లాలో 102 మద్యం దుకాణాలకే లైసెన్స్‌లను జారీ చేశారు. వీటితో పాటు సుమారు 15 బార్‌లు కొనసాగుతున్నాయి. బార్‌లు ఉన్న పరిసరాల్లోని గ్రామాల్లో బెల్టుషాపులు ఉండటం అక్కడ సిట్టింగ్‌లను నిర్వహించడం వల్ల బార్‌లకు రద్దీ తగ్గిందని యజమానులు చెబుతున్నారు. ఈమేరకు బెల్టుషాపుల నిర్వాహకులకు ఎక్సైజ్ ఉద్యోగులు ఫోన్‌లు చేసి సిట్టింగ్‌లు నిర్వహించవద్దని ఆదేశాలు జారీ చేశారు. బెల్టుషాపులలో సిట్టింగ్‌లను ప్రోత్సహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

చర్యలు చేపడుతాం..

మద్యం అక్రమ సిట్టింగ్‌లు నిర్వహించకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఎవరైనా అక్రమ సిట్టింగ్‌లను ప్రోత్సహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. మద్యం అమ్మకాలకు టార్గె ట్ ఉన్నా.. చట్టం ప్రకారమే వ్యవహరిస్తున్నాం.

– గుండప్ప, ఎక్సైజ్ సీఐ, మోర్తాడ్

పార్ట్‌టైం అధ్యాపకులకు రాతపరీక్ష



తెయూలో పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఎంఎడ్ పార్ట్‌టైం అధ్యాపకుల నియామకం కోసం బుధవారం విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో రాతపరీక్ష నిర్వహించినట్లు రిజిస్ట్రార్ విద్యావర్ధిని తెలిపారు. రాతపరీక్ష అనంతరం అభ్యర్థులకు మౌఖిక పరీక్షను నిర్వహించారు. టీయూ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ రవీందర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్షకు 20 మంది అభ్యర్థులు హాజరైనట్లు రిజిస్ట్రార్ పేర్కొన్నారు.

27న అంగన్‌వాడీ ఉద్యోగుల ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు

ఖలీల్‌వాడి: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 27న ఐసీడీఎస్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు అంగన్‌వాడీ ఉద్యోగుల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రమేష్‌బాబు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి 13న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కైరి దేవగంగు, స్వర్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రకళ, జిల్లా నాయకులు వాణి, గోదావరి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో బుధవారం జరిగిన మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. డివైడర్‌ను ఢీకొని లైన్‌మెన్, ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొని ఓ యువకుడు, బైక్‌ను ఢీకొని ఓ మహిళ మృత్యువాత పడ్డారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అంత్యక్రియలకు వెళ్తున్న ఓ మహిళ రోడ్డు ప్రమాదంలో అనంతలోకాలకు వెళ్లిన ఘటన మండలంలోని మర్కల్ శివారులో గల 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం బెల్లాల్‌కు చెందిన కాపర్ల వనమ్మ(48), కుమారుడు ఉదయ్‌కిరణ్‌తో కలిసి బైక్‌పై సిద్దిపేటలో జరిగే బంధువుల అంత్యక్రియలకు బయలుదేరింది. కామారెడ్డి వైపు వెళ్తున్న మర్కల్ చెందిన ఆర్గోండ రాజు బైక్‌ను మర్కల్ శివారులో ఉదయ్‌కిరణ్ ఢీకొట్టాడు. ఈఘటనలో ఉదయ్‌కిరణ్ అతని తల్లి రోడ్డుపై పడడంతో తలకు తీ వ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఆర్గోండ రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని లైన్‌మెన్..

ఎడపల్లి(బోధన్): మండలంలోని సాటాపూర్ గేట్ వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో లైన్‌మెన్ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఒడ్డేపల్లి గ్రామానికి చెందిన కె.కె.ఇమాం (38) కరెంట్ డిపార్టుమెంట్‌లో ప్రైవేట్ వర్కర్ పనులు చేస్తున్నాడు. బుధవారం అతడు జైతాపూర్ గ్రామంలో విద్యుత్ పనులను ముగించుకొని బైక్‌పై ఎడపల్లికి వస్తుండగా బోధన్–నిజామాబాద్ ప్రధాన రహదారిపైగల సాటాపూర్ గేట్ వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈప్రమాదంలో ఇమాం తలకు తీవ్రగాయాలు కాగా, స్థానికులు అతడిని బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పాండేరావు తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైక్: ఒకరు..



శేఖర్ (ఫైల్)

నిజాంసాగర్(జుక్కల్): పిట్లం మండలం సిద్దాపూర్ శివారులో డీజిల్ లేక రోడ్డుపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. చిల్లర్గి గ్రామానికి చెందిన అంతగాని శేఖర్(23) బుధవారం బైక్‌పై పిట్లం గ్రామా నికి బయలుదేరాడు. సిద్దాపూర్ శివారులో ఆగి ఉ న్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో శేఖర్ తీ వ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తల్లిదండ్రులు గంగమణి, సిద్దప్పకు ఇద్దరు కూతుళ్లు ఉండగా, కుమారుడు శేఖర్ మృతి చెందడంతో వారి రోదనలు మిన్నంటాయి.

తప్పిపోయిన బాలుడు.. తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డి: పట్టణంలో బుధవారం తప్పిపోయి తిరుగుతున్న బాలుడి ఆచూకీని కనుగొని గంటలోనే వారి తల్లితండ్రులకు పోలీసులు అప్పగించారు. ఎస్సై గణేష్ తెలిపిన వివరాలు ఇలా.. పిట్లం మండలంలోని వడ్లం గ్రామానికి చెందిన విజయ్– ప్రేమలతలు ఎల్లారెడ్డిలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో గల వారి బంధువుల ఇంటికి వచ్చారు. వారి నాలుగేళ్ల కుమారుడు అశ్విత్ కాలనీలోని దుకాణానికి వచ్చి తప్పిపోయాడు. కాలనీలో ఏడుస్తున్న చిన్నారిని చూసి స్థానికులు పోలీసులకు అప్పగించారు. పోలీసులు చిన్నారి తల్లితండ్రుల ఆచూకీని కనుగొని వారికి అప్పగించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శంకర్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పోతాయిపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై శంకర్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి గెరవోయిన భూమయ్య ఇంటికి తాళం వేసి, తన పెద్ద కూతురును చూసి రావడానికి కుటుంబంతో కలిసి మొటాజ్‌పల్లి గ్రామానికి మంగళవారం వెళ్లాడు. బుధవారం ఉదయం ఇంటి తలుపులు తెరచి ఉండటంతో అన్న అంజయ్య అతడికి సమాచారం అందించారు. వెంటనే వారు ఇంటికి వచ్చి పరిశీలించడంతో ఇంట్లో ఉన్న వెండి ఉంగరాలు, పట్టగొలుసులు, వడ్లు అమ్మగా వచ్చిన రూ. 30 వేలు, బంగారు కమ్మలు, ఇతర వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృత్యువాత

కమ్మర్‌పల్లి: మండలంలోని బషీరాబాద్ శివారులోని కాడి చెరువు సమీపంలో ఈనెల 15న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. వివరాలు ఇలా.. మండలంలోని కోనాసముందర్‌కు చెందిన గమ్మత్ రత్నాకర్(33) ఆదివారం మధ్యాహ్నం బైక్‌పై బషీరాబాద్ వెళ్తుండగా, కాడి చెరువు సమీపంలో బైక్ అదుపు తప్పింది. దీంతో బైక్‌పై ఉన్న రత్నాకర్ కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

బైక్ పైనుంచి పడి ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యాదమ్మ

ఎడపల్లి(బోధన్): మండలంలోని జైతాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్ తన నానమ్మ యాదమ్మతో కలిసి బైక్‌పై డిచ్‌పల్లి నుంచి జైతాపూర్ వైపు బయలుదేరాడు. బాపునగర్ వద్ద బైక్‌కు కుక్క అడ్డురావడంతో వారు కిందపడ్డారు. ఈ ఘటనలో గంగాధర్, యాదమ్మలు గాయపడ్డారు. యాదమ్మను చికిత్స నిమిత్తం స్థానికులు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మొరం తవ్వుతున్న జేసీబీలకు జరిమానా


రెంజల్(బోధన్): మండలంలోని నీలా శివారులో గల గంగాసాగర్ కుంటలో మంగళవారం అక్రమంగా మట్టి, మొరం తవ్వకాలు చేపట్టడంతో గంగపుత్రులు అడ్డుకున్నారు. ఆలస్యంగా స్పందించిన అధికారులు స్థానికుల డిమాండ్ మేరకు కుంటలో తవ్వకాలు చేపడుతున్న రెండు జేసీబీలు, 7 టిప్పర్లను అధికారులు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్ రాంచందర్ ఒక్కో జేసీబీకి రూ. 15వేల చొప్పున జరిమానా విధించారు. మొరంతో పట్టుబడిన ఒక టిప్పర్‌కు మైన్స్ అధికారులు జరిమానా విధిస్తారన్నారు. ఖాళీగా పట్టుబడిన మిగిలిన టిప్పర్లను, యంత్రాలను పోలీసులు విడుదల చేశారు. చెరువులో పట్టుబడిన టిప్పర్లకు జరిమానా విధించకుండా వదిలిపెట్టడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు



రుద్రూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీలో బుధవారం చందూర్ విక్టరి స్కూల్ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ఇంటిలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఇంటి ప్రహరీ ధ్వంసమైంది. బస్ బ్రేక్ సరిగా పడకపోవడం, అదే సమయంలో ఎదురుగా లారీ రావడంతో ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. బస్సులో విద్యార్థులు లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

డివైడర్‌ను ఢీకొని వ్యాన్ బోల్తా



ఎల్లారెడ్డి: డివైడర్‌ను ఢీకొని కోళ్ల వ్యాన్ బోల్తా పడిన ఘటన ఎల్లారెడ్డిలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ నుంచి హైదరాబాద్‌కు కోళ్లను తరలిస్తున్న వ్యాన్‌ను డ్రైవర్ నిద్ర మత్తులో నడపడంతో పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు గల డివైడర్‌ను ఢీకొంది. వ్యాన్‌లో నలుగురు ఉండగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. 500 కోళ్లు మృతి చెందినట్లు వ్యాన్‌లో ఉన్న వారు తెలిపారు. వేగంగా నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుల అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్లు

ఇందల్వాయి: నిజామాబాద్ జిల్లాతో పాటు కామారెడ్డి, సిరిసిల్లా జిల్లాలో వరుసగా బైక్‌లను చోరీ చేస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. బోధన్‌లోని ఆజమ్‌గంజ్‌కు చెందిన మాలవత్ తులసిరామ్, రాథోడ్ వినోద్ ఇద్దరు కలిసి గత నెల రోజుల వ్యవధిలో మూడు బైక్‌లు దొంగలించినట్లు తెలిపారు. గతంలో 12 బైక్‌లు చోరీ చేశారు. వీరిని తిర్మన్‌పల్లి గ్రామంలో విశ్వసనీయ సమాచారం మేరకు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 12బైక్‌లను రికవరీ చేశారు. కేసు ఛేదనలో చురుగ్గా పనిచేసిన పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.